ప్రజాశక్తి

శనివారం 26 ఆగష్టు 2023 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ప్రజల సొమ్ముపై..

అధికార పార్టీ పెత్తనం

- ఎమ్మెల్యే సంతకం ఉంటేనే 'టిడ్కో' డబ్బు వెనక్కి ఇస్తున్న వైనం
- కమిషనర్ సంతకం కూడా తప్పనిసరి
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న జనం



టిడ్కోకు కట్టిన డబ్బు కోసం కమిషనర్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సొమ్ము ఒకరిది సోకొకరిది అన్న సామెత అధికార వైసిపి నేతలకు సరిపోతుంది. సొమ్ము ఒకరిదిది అయితే దానిమీద పెత్తనం అధికార పార్టీ నేతలది అవుతోంది. ఒంగోలు నగరంలో టిడ్కో ఇళ్లు రాని లబ్ధిదారులకు వారి వాటా ధనంగా చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తున్నారు. ప్రజలకు ఇవ్వాల్సింది పెద్దమొత్తంలో ఉంటే నగరపాలక సంస్థలో అందుబాటులో ఉన్న నిధులు మాత్రం నామమాత్రం. దీంతో ఎవరు ముందుగా స్థానిక ఎమ్మెల్యే సంతకం పెట్టించుకుంటే వారికి ▶ 2లో



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

అధిక ధరలకు వ్యతిరేకంగా

30 నుంచి నిరసనలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

ప్రజల సొమ్ముపై అధికార పార్టీ పెత్తనం

(మొదటిపేజీ తరువాయి)

డబ్బులు ఇస్తామంటూ నగరపాలక సంస్థ అధికారులు నిబంధన పెట్టారు. దీంతో టిడ్కో రుణాలు తిరిగి పొందాల్సిన లబ్ధిదారులు ఎమ్మెల్యే ఇంటికి పరుగులు పెడుతున్నారు. ఎమ్మెల్యే సంతకం తీసుకున్న తరువాత కమిషనర్ సంతకం కూడా తీసుకోవాల్సి ఉంది. దీంతో ఆయన సంతకం కోసం కూడా కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ వద్ద పడిగాపులు కాస్తున్నారు.

శుక్రవారం కూడా పలువురు తాము కట్టిన డబ్బుల కోసం కార్పొరేషన్ కార్యాలయం వద్దకు వచ్చారు. వారందరూ ఎమ్మెల్యే వద్ద సంతకం తీసుకొని కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసేందుకు వచ్చారు. బయట వేరే కార్యక్రమాల్లో ఉన్న కమిషనర్ మధ్యాహ్నం వరకు కార్పొరేషన్ కార్యాలయానికి రాలేదు. దీంతో వారు కమిషనర్ ఛాంబర్ వద్ద, ఆఫీసు చెట్ల కింద వేచి ఉన్నారు.

ఒంగోలు నగరంలో టిడ్కో ఇళ్లు పొందేందుకు 2018లో నగరానికి చెందిన దాదాపు 15 వేల మంది ప్రజలు భారీగా డబ్బులు చెల్లించారు. వారిలో సుమారు నాలుగు వేల మందికి మాత్రమే గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. మిగిలిన వారికి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు భూమి కొనుగోలు చేసి, పనులు ప్రారంభించే సమయంలో 2019లో ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల్లో విజయం సాధించి వైసిపి అధికారంలోకి వచ్చింది. టిడ్కో ఇళ్ల నిర్మాణంలో అవినీతి జరిగిందని వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌కు వెళ్లింది. అప్పటివరకు నిర్మాణంలో ఉన్న ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు అప్పగిస్తామని, మిగిలినవి రద్దు చేస్తామని ప్రకటించింది. చెప్పినట్లుగానే నిర్మాణంలో ఉన్న ఇళ్లను మినహాయించి మిగిలినవి రద్దు చేశారు. ఇళ్లు రద్దు అయిన వారికి వారు వాటా ధనంగా చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పింది. అలా సుమారు 11 వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.21 కోట్ల డబ్బులు తిరిగి ఇవ్వాల్సి ఉంది. గతంలో రూ.కోటి చెల్లించారు. ఇటీవల కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు తిరిగి ఇవ్వడంతో ఆ డబ్బులు ఇప్పుడు ఇళ్లు రద్దయిన వారికి ఇస్తున్నారు. మరో రూ.17 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

ప్రజలకు ఇవ్వాల్సిన సొమ్ము పెద్ద మొత్తంలో ఉండటం, ప్రభుత్వం నుంచి కేవలం కొద్దిగా మాత్రమే డబ్బులు రావడంతో ఆడబ్బులు అలాగే కార్పొరేషన్ అకౌంట్‌లోనే ఉంచేశారు. రూ.3 కోట్ల నిధులు వచ్చి దాదాపు ఆరుమాసాలు అయినా ఎవరికీ ఇవ్వలేదు. ఇటీవల గడపగడపకు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజల్లోకి వెళ్లినప్పుడు వారు టిడ్కో డబ్బుల కోసం ఆయన్ను అడగడం ప్రారంభించారు. దీంతో ఎమ్మెల్యే డబ్బులు ఇప్పిస్తానని ప్రకటించారు. దీంతో డబ్బులు తిరిగి రావాల్సిన వారంతా లాయర్‌పేటలోని ఎమ్మెల్యే ఇంటి బాట పడుతున్నారు.

వాస్తవానికి తాము చెల్లించిన డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని సుమారు రెండు వేల మంది వరకు ఈపాటికే కార్పొరేషన్ కమిషనర్‌కు దరఖాస్తు పెట్టుకొని ఉన్నారు. గత రెండు, మూడేళ్లుగా వారు తమ డబ్బు తమకు ఇవ్వాలని కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు తిరిగి చెల్లించాల్సి వస్తే డబ్బు కోసం ముందుగా కార్పొరేషన్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. అలా కాకుండా ఎమ్మెల్యే సంతకంతో వచ్చిన వారికి డబ్బులు తిరిగి ఇస్తుండటంతో డబ్బు చెల్లించిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా సొమ్ము మీద మీ పెత్తనం ఏంటని అధికార పార్టీ నేతలను ప్రశ్నిస్తున్నారు. ఎవరి డబ్బులు వారికి ఇచ్చే విషయంలోనూ రాజకీయాలు చొప్పించడాన్ని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి.

రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని పులికొండ గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లోన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లి కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. గేదెలు,ఆవులు కొనుగోలు చేసుకోవడానికి కోఆపరేటివ్ బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కెసిసి రుణాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డిఆర్‌డిఎ ద్వారా రుణాలు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 50 మంది రైతులు గేదెల కొనుగోలుకు దరఖాస్తులు చేసుకున్నారు. మరో 50 మంది కెసిసి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిప్పట్లపాడు పశు వైద్యాధికారి డాక్టర్ కె. ప్రశాంతి, ఇఒఆర్‌డి సతీష్, ఎపిఎం కోటేశ్వరరావు, బ్యాంకు మేనేజర్ రాజేంద్ర, పులికొండ సర్పంచి రావి లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె ప్రశాంతి

కొత్తపట్నం: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో పాడి రైతులకు పశువుల కొనుగోలు నిమిత్తం లోన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిఒపి రాజశేఖర్ మాట్లాడుతూ లోన్ మేళా ద్వారా పాడి రైతులుకు పిడిసిసి బ్యాంకు ద్వారా లోను మంజూరు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరు పశువైద్యాశాల వైద్యురాలు డాక్టర్ శోభారాణి, పిడిసిసి బ్యాంక్ మేనేజర్ అజీబా, ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, సర్పంచి నంబూరి సూర్యనారాయణ, ఎంపిటిసి శాంతారావు, ఉపిఎం రజియా సుల్తానా బేగం, పశువర్ధక శాఖ ఏడీ బసవ శంకర్రావు, కొత్తపట్నం పశు వైద్యశాల వైద్యులు డాక్టర్ ఆశ, పాడి రైతులు పాల్గొన్నారు

వరలక్ష్మి వ్రతాలు

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఉప్పుగుండూరులోని అంకమ్మ మహలక్ష్మమ్మ దేవస్థానంలో 108 మంది మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు ఉప్పు గుండూరు నీలాయపాలెం పొలిమేర వద్ద ఉన్న వెంకటేశ్వం ా్వామి దేవస్థానంలోప్రత్యేక పూజలు నిర్వహించి. అన్నదానం చేపట్టారు.

సిఎస్ పురంరూరల్ : మండల పరిధిలోని అయ్యలూరువారి పల్లిలో వెలిసి యున్న శ్రీలలితా దేవి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం వైస్ ఎంపిపి భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి దంపతులు, భూమి రెడ్డి బ్రదర్స్ సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 28న విడత జగనన్న విద్యా దీవెన పథకాన్ని ప్రారంభిచనున్నారని, ఈ నేపథ్యంలో ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయాలని సోషల్ వెల్‌ఫైర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కొండపి ఎఎస్‌డబ్ల్యు పరిధిలోని 7 మండలాల సచివాలయాల వెల్ఫేర్ సిబ్బందితో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ ఎన్‌పిసిఐ ఆధార్‌లింక్ చేయించడానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌డబ్ల్యుఒ దానయ్య, తదతరులు పాల్గొన్నారు.

కెజిబివిలో జిసిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సిఎస్‌పురంలోని కెజిబివిని జిసిడిఒ ఎం.ప్రమోద శుక్రవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆమె కెజివిబిని తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా ఉపాధ్యాయనుల హాజరు పట్టిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థినుల పట్ల ఆపాయ్యతతో మసులుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ షేక్ రేష్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు: ఎస్‌పి

ప్రజాశక్తి-అద్దంకి

పేరాయిపాలెం హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు ఆరుగురికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేయడంలో మంచి కృషి చేసిన దర్శి డిఎస్పి షేక్ నజీర్ అహమ్మద్, సీఐ రాంబాబులను అభినందించారు. అలాగే కేసును పర్యవేక్షిస్తూ దోషులకు శిక్ష పడేలా సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు అందించడంలో కృషి చేసిన చీరాల డిఎస్‌పి ప్రసారరావు, అద్దంకి సీఐ, పోలీస్ సిబ్బందిని కూడా ప్రత్యేకంగా అభినందించారు. వివరాల్లోకెళ్తే.. 2009 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో మండలంలోని పేరాయపాలెం గ్రామంలో ఓట్లు వేసుకునే విషయంలో గొడవ జరిగింది. ఘర్షణలో గ్రామానికి చెందిన చెన్నుపాటి రమేష్(30)ను రాజకీయ ప్రత్యర్థులు జాగర్లమూడి సత్యనారాయణ, జాగర్లమూడి శ్రీను, జాగర్లమూడి నాగేశ్వరరావు మన్నం రామాంజనేయులు, కొర్రపాటి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి చిన్న శ్రీనివాసరావు, అనపర్తి నెల్సన్‌రావు, పుట్టా శ్రీనివాసరావు వలేటి శ్రీనివాసరావు, వలేటి సుబ్బారావు అను పదిమంది మూకుమ్మడిగా దాడి చేయగా చిన్నపాటి రమేష్ అక్కడికక్కడే మతి చెందారు. మర్రిపూడి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను 2009 ఏప్రిల్ 28న అరెస్ట్ చేసి రిమాండుకు పంపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్దేశంతో కోర్టు మానిటరింగ్ వ్యవస్థ మీద ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేక దృష్టి సారించి చేరాల డిఎస్పీకి అద్దంకి సిఐకి తగిన సూచనలు చేయగా వారి పర్యవేక్షణలో సాక్షులను గుర్తించి వారికి సరైన తర్ఫీదు ఇవ్వటం ద్వారా నిందితులు అయిన జాగర్లమూడి సత్యనారాయణ, జాగర్లమూడి శ్రీను, జాగర్లమూడి నాగేశ్వరరావు, మన్నం రామాంజనేయులకు జీవిత ఖైదు అయిదు వేల జరిమానా విధించారు. మిగతా నిందితులకు మూడేళ్లు కఠిన కారాగారశిక్షతో బాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ కోర్ట్ ట్రయల్ మానటరింగ్ విధానం ద్వారా పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షించడం వల్ల తీవ్రమైన కేసులలో సత్ఫలితాలు వస్తున్నాయని, జైలు శిక్షలు పడే కేసులు పెరిగాయని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఎస్‌పి వకుల్ జిందాల్

రేపు గుంటూరులో ముస్లిం ఐక్యవేదిక సమావేశం

ప్రజాశక్తి-బాపట్ల

ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐక్యతా సమావేశం ఈ నెల 27వ తేదీ ఆదివారం గుంటూరు బి కన్వెన్షన్ సెంటర్లో నిర్వహిస్తున్నట్లు ముస్లిం ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు మౌలాబేగ్ తెలిపారు. శుక్రవారం ఆహ్వాన పత్రాల పంపిణీ సందర్భంగా ఆయన బాపట్లలో విలేకరులతో మాట్లాడారు. మౌలా బేగ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు, మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్లు, మేధావులు, సంఘ సేవకులు, డాక్టర్లు, లాయర్లు, వివిధ అసోసియేషన్ పెద్దలు, వివిధ ముస్లిం ఆర్గనైజేషన్ పెద్దలు, వులేమాలు, కుల సంఘాల పెద్దలు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలని, 15 ఎమ్మెల్యే, 4 ఎంపీ సీట్లు కేటాయించాలని, ఎస్సీ ఎస్టీ తరహాలో ముస్లిములకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, చట్ట సభల్లో కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టే నల్ల చట్టాల బిల్లులకు వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆయన కోరారు. వక్ఫ్ బోర్డు ప్రక్షాళన, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనపరచుకోవాలని అన్నారు. మైనారిటీ సబ్ ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని, ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి వడ్డీ రహిత రుణాలు మంజూరు చేయాలని కోరారు. ముస్లిం విద్యార్థుల కోసం మోడరన్ ఉర్దూ యూనివర్సిటీతో పాటు ప్రతి మండలంలో మోడరన్ ఉర్దూ స్కూల్ జిల్లాకో కళాశాల ఏర్పాటు చేసి ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక షాదిఖానా నిర్మించాలన్నారు. ఆహ్వాన పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ బాషా, గౌరవ అధ్యక్షులు జిలాని, ముస్లిం ఐక్యవేదిక బాపట్ల నియోజకవర్గ అధ్యక్షులు తాజుద్దీన్, సయ్యద్ పీర్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రాలు అందజేస్తున్న ముస్లిం నాయకులు

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దదోర్నాల మండలంలోని ఇష్టకామేశ్వరి ఆలయం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని బోడేనాయక్ తండాకు చెందిన దేశావత్ పెద్ద బాలు నాయక్ శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ఇష్టకామేశ్వరి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. అతనిని నంద్యాల జిల్లా సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కాగా బంధువులు అతడిని మెరుగైన చికిత్స కోసం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు.


గాయపడిన పెద్దబాలూనాయక్

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-చీరాల: రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కారిపల్లె మండలం ఇల్లెందు గ్రామానికి చెందిన కె నరేష్ బేల్దారీ పనులకు ఒంగోలు వచ్చి తిరిగి ఖమ్మం వెళ్లేందుకు పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఒంగోలులో ఎక్కాడు. రైలులో గేటు వద్ద కూర్చున్న ఇతడు నిద్రమత్తులో పాత చీరాల గేటు సమీపానికి రాగానే ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పట్టాల పక్కన పడిపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున రక్తగాయాలతో పడి ఉన్న ఇతడిని స్థానికులు చూసి 108కి సమాచారాన్ని అందజేశారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేస్తూ చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అవుట్ పోస్టు పోలీసులు క్షతగాత్రుడి నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు.



ఇద్దరిని కాపాడిన సిబ్బందికి అభినందన

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో ఇద్దరు యువకుల ప్రాణాలను కాపాడిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను బాపట్ల డిఎస్‌పి టి వెంకటేశులు అభినందించారు. శుక్రవారం బాపట్ల డిఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఉదయం బాపట్ల డిఎస్‌పి ఆయన కార్యాలయంలో పోలీసు సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఘనంగా శాలువాతో సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈ నెల 23వ తేదీ బుధవారం బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలో స్నానం చేస్తూ మంగళగిరికి చెందిన ఫణితపు దేవప్రకాష్ షన్ను, అందే ప్రశాంత్ అనే యువకులు అలల ధాటికి సముద్రంలోకి కొట్టుకుపోతున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సముద్రంలోకి వెళ్లి ఆపదలో ఉన్న ఆ యువకులను సముద్రపు ఒడ్డుకు తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందజేసి వారి ప్రాణాలను కాపాడిన సూర్యలంక అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహించే హెడ్ కానిస్టేబుల్ ఎం పోతురాజు, కానిస్టేబుల్ పి వెంకటరావు, సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే హోంగార్డు కె వెంకటనారాయణ, గజఈతగాళ్లు కొక్కిలిగడ్డ సుబ్బారావు, కొక్కిలిగడ్డ సత్యనారాయణ, మోకా గోపికృష్ణలను అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సూచనలతో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే సూర్యలంక సముద్రతీరం వెంబడి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. యాత్రికుల రక్షణ కోసం సముద్ర తీరం వెంబడి గజఈతగాళ్లను నియమించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు యాత్రికులను అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా పోలీస్ సిబ్బంది హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తున్నారన్నారు. కొంతమంది యువకులు పోలీసు సూచనలను, హెచ్చరికలను పెడచెవిన పెట్టి సముద్రం లోపలకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహ్లాదకరంగా గడపడానికి సముద్రతీరాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ప్రమాదాలు, సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా వారి పర్యటనను ముగించుకొని సంతోషంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతోనే పోలీసువారు పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తుంటారన్నారు. యాత్రికులు పోలీస్ వారి సూచనలను తప్పనిసరి పాటించాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మద్యం సేవించి సముద్రంలోకి దిగినా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పోలీస్ వారి సూచనలు పెడచెవిన పెట్టినా, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో సూర్యలంక సముద్రతీరంలో ఎంతోమంది యాత్రికుల ప్రాణాలను పోలీసు సిబ్బంది, గజఈతగాళ్లు కాపాడారన్నారు. ఆగస్టు 23 బుధవారం ఇద్దరి యువకుల ప్రాణాలను పోలీస్ సిబ్బంది, గజఈతగాళ్లు ప్రాణాలకు తెగించి కాపాడారన్నారు. వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపి, ఘనంగా సన్మానించి నగదు బహుమతి అందించినట్లు తెలిపారు. రాబోయే రోజులలో కూడా పోలీసు ప్రతిష్టను పెంచేవిధంగా విధులు నిర్వహించి, మిగిలిన పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, బాపట్ల పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ కృష్ణయ్య, బాపట్ల పట్టణ, రూరల్ ఎస్‌ఐలు, బాపట్ల ట్రాఫిక్ ఆర్‌ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


యువకులను కాపాడిన పోలీసులు, గజఈతగాళ్లను అభినందిస్తున్న డిఎస్పీ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ టి శ్రీరామ్ (ఇన్‌సెట్‌లో) కార్తీక్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామంలో కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. శుక్రవారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ టి శ్రీరామ్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. పెదకనమళ్లకు చెందిన పాలకీర్తి కార్తీక్(11) అనే విద్యార్థి బాతుల మిషన్ వద్దకు వెళ్లి ఫ్యాను వైర్లు సాకెట్లో పెట్టే సమయంలో చేతికి కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయాడు. అక్కడ ఉన్నవారు గమనించేలోపే కరెంటు షాక్‌తో కార్తీక్ మరణించాడు. ఎస్‌ఐ టి శ్రీరామ్ కార్తీక్ మృతదేహాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్తీక్ మరణవార్త విని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి బంధువు అయిన ఎంపిపి కట్టా శోభారాణి, ఇతర బంధువులు, వారి కుటుంబ సభ్యులు మొత్తం తల్లడిల్లుతున్నారు. ఈ విద్యార్థి శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ విషయం తెలుసుకొని ప్రిన్సిపాల్ కే లక్ష్మణ్ కనుమళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం నాడు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ కు సెలవు ప్రకటించారు.



విద్యుద్ఘాతానికి గేదె మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యుత్ ఘాతానికి గురై గేదె మృతిచెందిన ఘటన మండల పరిధిలోని దరిమడుగు గ్రామంలోని ఎస్సీ పాలెంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కల్వకుంట్ల చిన్నచెన్నయ్యకు చెందిన గేదె సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫారం వద్ద ఉన్న చిల్లచెట్లలో గడ్డిమేస్తున్న క్రమంలో పక్కనే ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న తీగలు గేదెకు తగలడంతో అక్కడికక్కడే కుప్ప కూలిపోయింది. ఎనభై వేల రూపాయల గేదె మృతి చెందడంతో పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చిన్న చెన్నయ్య కన్నీరు మున్నీరు అవుతున్నాడు. ప్రభుత్వమే స్పందించి చెన్నయ్యను ఆదుకోవాల్సిందిగా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ తీగల కిందకు వేలాడుతున్న సమస్యను పలు పర్యాయాలు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లినా ఆ దిశగా పరిష్కార ఏర్పాటు చెయ్యలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెంత ప్రాణనష్టం జరిగితే విద్యుత్ అధికారులకు చలనం వస్తుందో అని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్ట నివారణ చర్యలు చేపట్టావలసినదిగా గ్రామస్తులు కోరుతున్నారు.

వైసిపిలో పొదిలి నేతలకు పదవులు

ప్రజాశక్తి-పొదిలి: శుక్రవారం ప్రకటించిన వైసిపి జిల్లా కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా పొదిలికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు జి శ్రీనివాసులును నియమించారు. ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులుగా షేక్ రబ్బాని, బండి అశోక్‌లను నియమించారు. కాగా జి శ్రీను గతంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆయన భార్య జి కోటేశ్వరి పొదిలి ఏఎంసీ చైర్మన్‌గా రెండు సంవత్సరాలు కొనసాగారు.


జి శ్రీనివాసులు


న్యూబైక్‌ను ఆవిష్కరిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ రాజశేఖర్

న్యూ గ్లామర్ బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అత్యధిక మైలేజీ ఇచ్చే విధంగా కొత్త బైక్‌లను విడుదల చేయడంలో హీరో మోటార్స్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని కెనరా బ్యాంకు మేనేజర్ బొడ్డు రాజశేఖర్ అన్నారు. స్థానిక హీరో ఆథరైజ్డ్ డీలర్ లక్ష్మి గణపతి మోటార్స్ షో రూంలో న్యూ గ్లామర్ 125సిసి కొత్త మోడల్ బైకును ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. నేటి పోటీ ప్రపంచంలో వివిధ రకాల కంపెనీలకు చెందిన బైకులు, ఎలెక్ట్రిక్ బైకులు మార్కెట్ లోకి వస్తున్నప్పటికీ హీరో మోటార్స్ కు చెందిన బైకులకు ఎంతో క్రేజ్ ఉందని అన్నారు. షోరూం మేనేజింగ్ పార్టనర్ కళ్లేపల్లి శ్రీనివాసరాజు మాట్లాడుతూ అదరికీ మెచ్చిన గ్లామర్ 125సిసి బైకును వినియోగదారుల అభిరుచి మేరకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ఫీచర్స్ తో హీరో మోటార్స్ సరికొత్తగా విడుదల చేసిందని తెలిపారు. కొత్త బైకును మొదటి కస్టమర్ కోనమనేని అశోక్‌కు బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి తిరుపతిరాజు, మిన్నెకంటి సాంబశివరావు, ఈదర అనిల్, ఉప్పలపాటి ధనుంజయ, కళ్లేపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

మానవ అభివృద్ధికే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-పిసిపల్లి


ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

మానవ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటిని ప్రజలకు చేరవేయడమే తమ కర్తవ్యమని ఎంపిడిఓ కె.శ్రీనివాసరెడ్డి ప్రజాశక్తికి తెలిపారు. మానవ అభివృద్ధికి ప్రధానంగా మూడు కీలక అంశాలున్నాయని అందులో మొదటిది వ్యక్తి గత అభివృద్ధి అన్నారు. చదువు కూడా వ్యక్తి గత అభివృద్ధికి కీలకమన్నారు. కనీస అవసరాలైన ఆహారం, తిండితోపాటు కూడు, గూడు లాంటి అందించేందుకు కృషి చేస్తామన్నారు. రోడ్లు, విద్యుత్, నీరు, వైద్యం లాంటివి ఉమ్మడిగా గ్రామీణ స్థాయిలో అందించాలన్నారు. ఈ ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు నేరుగా చేరేందుకు కృషి చేస్తామన్నారు. మండల అభివృద్ధి అధికారిగా ఈ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత తనదేనన్నారు. మండల స్థాయి అధికారులు అందరితో కలిసి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.


పట్టుబడిన రేషన్ బియ్యం లోడు స్వాదీనం చేసుకున్న ఎస్ఐ

70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చీరాల

రేషన్ బియ్యం అక్రమ రవాణాన్ని అధికారులు ఎంత అరికట్టాలని ప్రయత్నించిన దళారులు మాత్రం ఆగడంలేదు. తమకు అనుకూలమైన అధికారుల కనుసైగలో ఊర్లు దాటించేస్తున్నారు. తాజాగా మండలంలోని ఈపూరపాలెం లో శుక్రవారం తెల్లవారు జామున ఎస్సై జనార్దన్ 70బస్తాల రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారంతో సావరపాలెం వద్ద వాహనాన్ని ఆపి తనిఖీచేయగా అందులోఉన్న 70బస్తాల రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే ఆ బియ్యం వెనుక చీరాల వాసి నాగూర్ వలి, వేటపాలెంకు చెందిన శివ అనే వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. మరిన్ని పూర్తి వివరాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

సోన పోరంబోకు భూములలో ఇసుక అక్రమ తవ్వకాలు

ప్రతిఘటించిన సిపిఎం, జనసేన నాయకులు

ప్రజాశక్తి - వేటపాలెం, చిన్నగంజాం

ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. యావత్ అధికార యంత్రాంగం ప్రేక్షలుడికి ఉండిపోతుంది. సిపిఎం, జనసేన నాయకులు మాత్రం ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు పూనుకున్నారు. చిన్నగంజాం మండలం లోని సర్వే నంబర్స్ 828, 829సోన పోరంబోకు భూములలో శుక్రవారం ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. వారంరోజుల క్రితం యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణాను అధికారులు పట్టించుకోవడంలేదని, అక్రమ తవ్వకాలు గమనించిన స్థానికులు సిపిఎం దృష్టికి తీసుకుని వచ్చారు. సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. అధికారులను నిలదీశారు. మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావతమైతే ఉద్యమిస్తామని హెచ్చరించారు అప్పటి నుండి ఇసుక అక్రమ రవాణాను గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారు. స్థానిక అధికారులు, జిల్లా అధికారులు సహకరిస్తున్నారని సిపిఎం, జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. తాజాగా మళ్లీ ఇసుక అక్రమార్కులు రెచ్చిపోయారు. జెసిబి సహాయంతో పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. దీంతో సిపిఎం, జనసేన నాయకులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలంటూ కడకుదురు నుండి చినగంజాం తాసిల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అసుక అక్రమాలు అడ్డుకోవాలని నినాదాలు చేశారు. తాసిల్దార్ సమాధానం చెప్పాలంటూ కార్యాలయం ముందు ధర్నా


తహాశీల్దారు కార్యాలయం వద్ద నేతల ధర్నా

చేశారు. తాసిల్దార్ పార్వతి ఆందోళనకారుల వద్దకు వచ్చి అక్రమార్కులపై చట్టపర్యమైన చర్యలు చేపడతామని చెప్పారు. ఇసుక తవ్వకాలు చేపడుతున్న జెసిబిని సీజ్ చేస్తామని చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇవ్వడంతో అక్కడి నుండి అధికారులతో కలిసి ఇసుక తవ్వకాలు చేపడుతున్న క్వారీ వద్దకు వెళ్లారు. అప్పటికే సమాచారం అందుకున్న అక్రమార్కులు టిప్పర్లు, ట్రాక్టర్లతో ఊడయించారు. జెసిబి మిషన్ మాత్రం ఇసుక క్వారీల్లోనే ఉంది. ఈ సందర్భంగా సిపిఎం చిన్నగంజాం, ఇంకొల్లు ప్రాంతాల నాయకులు జి ప్రతాప్ కుమార్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి విజయ్ కుమార్ మాట్లాడుతూ చిన్నగంజాంలో మునిపెన్నడు లేని విధంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతూ ఉంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. ఇంకొల్లు సీఐ వి సూర్యనారాయణ ఆధ్వర్యంలో చిన్నగంజాం, పర్చూరు, కారంచేడు ఎస్సైలు గట్టి బందోబస్తు నడుమే నాయకులు ఇసుక లారీలను అడ్డుకున్నారు. ఇప్పటికైనా చిన్నగంజాంలో ఇసుక అక్రమ రవాణా ఆపకపోతే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సమిష్టిగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మాది ప్రజాసంక్షేమ ప్రభుత్వం

- ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి
- ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - చుండూరు

ప్రజా ప్రయోజనాలు, సంక్షేమమే లక్ష్యంగా వాలంటీర్లు, గహసారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని వైఎస్ఆర్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణకోస్తా జిల్లాల పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. వేమూరు నియోజకవర్గం చుండూరు మండల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లలతో శుక్రవారం వలివేరు గ్రామంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మేరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వాలంటీర్లు, గహసారథులు, సచివాలయ కన్వీనర్లు నుండి సలహాలు, సూచనలను ఆయన స్వీకరించారు. వారు లేవనెత్తిన అంశాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అలాగే ఈ సమావేశంలో ఇచ్చిన సలహాలు, సూచలను స్వీకరిస్తామని, కొన్ని సమస్యలను పరిష్కారం చూపుతామన్నారు. గహసారథులకు ఇన్సూరెన్స్‌తో పాటుగా ఏ విధంగా న్యాయం చెయ్యాలి అన్న విషయాన్ని పార్టీ దష్టికి తీసుకెళ్తానన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ది ప్రజా ప్రభుత్వమని, బడుగు బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాల అభివద్ధి కోసం అహర్నిశలు కషి చేస్తుందని చెప్పారు. ఈ రాష్ట్రంలో 87శాతం పైగా



సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

గహాలు ప్రభుత్వం నుంచి ఏదో ఒక రూపంలో లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. అభివద్ధి పథకాల విషయంలో ఈ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా అమలు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం మహిళలకు సంక్షేమ పథకాలు అందించడంలో ముందుందని చెప్పారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని వైయస్సార్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిందని, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రైవేట్ మెంబర్ బిల్ పార్లమెంట్లో ప్రవేశపెట్టిందని చెప్పారు. వాలంటీర్లు, గహసారధులు, కన్వీనర్లు మూడు వ్యవస్థలు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వానికి అన్ని విధాలుగా పై మూడు వ్యవస్థలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మీ నియోజకవర్గంలో ఏదైనా సమస్య ఉంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మెరుగు నాగార్జున దష్టికి తీసుకురండి, లేదా స్థానిక జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణ దష్టికి తీసుకురండి, లేనిపక్షంలో తన దష్టికి తీసుకురావాలని చెప్పారు. తమ స్థాయిలో మీ సమస్యలు పరిష్కారం కాకపోతే సిఎం దష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. మంత్రి మెరుగు నాగార్జున మాట్లాడుతూ ప్రజల సంక్షేమం దష్టిలో పెట్టుకుని జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా కషి చేస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దళిత, బడుగు బలహీన వర్గాలకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం జగన్ కషి చేస్తున్నారని కొనియాడారు. బాపట్ల వైఎస్ఆర్ సిపి జిల్లా అధ్యక్షుడు, ఎంపి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎవరి మీద వివక్షత చూపకుండా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని చెప్పారు.

దిండుపాలెం గ్రామాభివద్ధికి రూ.25లక్షల నిధులు : విజయసాయిరెడ్డి

మండలంలోని దిండుపాలెంలో డ్రైనేజీ పనుల నిమిత్తం తన ఎంపీ లాండ్స్ నిధుల నుంచి రూ.25లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. అంతకుముందు ఆ గ్రామ సర్పంచ్ భగవద్గీత, స్థానిక మంత్రి మేరుగు నాగార్జున ఈ గ్రామానికి నిధులు మంజూరు చేయాలని సభాముఖంగా కోరారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఐక్య పోరాటాలు

ప్రజశక్తి - చీరాల


వంగర శివకు నియామక పత్రం ఇస్తున్న దృశ్యం

జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం ఈపురుపాలెం ఉప కార్యదర్శిగా వంగర శివను నియమిస్తూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శీలం వెంకటేశ్వర్లు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారమే లక్ష్యంగా ఐక్య పోరాటాలు చేస్తుందని అన్నారు. సెప్టెంబర్ 10న చీరాలలో రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు తెలిపారు. చేనేత సమస్యలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ అధికారం ఉంటేనే చేనేత సమస్యల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని అన్నారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు అవ్వరు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషింగప్ప, కోర్ కమిటీ సభ్యులు, 26జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గాల అధ్యక్షులు ప్రతినిధులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఐ పోస్టులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి పాల్‌రాజ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేంజ్ పరిధిలో యస్ఐ పోస్టుల నియామక పక్రియలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ ధారుఢ్య పరీక్షలు గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. డిఐజి పాల్ రాజ్, ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ శుక్రవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. 100 మీటర్ల పరుగు పందెం, 1600 మీటర్ల పరుగు పందెం, ఎత్తు, బరువు, ఛాతి కొలతలు, లాంగ్ జంప్ చేసే ప్రదేశాలను పరిశీలించారు. అనుమానాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. మెడికల్ విభాగం, అంబులెన్స్ ఏర్పాటు చేశారు. రేంజ్ పరిదిలో 12 వేల 957మంది అభ్యర్థులు పాల్గొంటున్నారు. వీరిలో 1909మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుండి పరీక్షల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలిస్తారు. ఎత్తు, చాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారు. ఆధునిక కంప్యూటరైజ్డ్ టెక్నాలజితో డిజిటల్ కొలతలు తీస్తారని తెలిపారు. ఎస్పై


ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఐజి పాల్‌రాజ్

అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామనే దళారుల మాటలు నమ్మవద్దని అన్నారు. ఆగష్టు 26నుండి సెప్టెంబర్ 16వరకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో ఈ వెంట్స్ జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు ఖచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. లేటెస్ట్ కుల దవీకరణ సర్టిఫికెట్, క్రిమిలేయర్ సర్టిఫికెట్ తీసుకురావాలి. వాటితో పాటు ఆధార్, అడ్మిట్ కార్డు, స్టడీ, మార్కిలిస్టులన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్లు (గెజిటెడ్ సంతకం) తప్పనిసరిగా తీసుకుని రావలెనని తెలిపారు. అదే విధంగా శుక్రవారం రావాల్సిన అభ్యర్థులకు వచ్చేనెల 16న దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గుంటూరుజిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కె కోటేశ్వరరావు, ఒంగోలు అదనపు ఎస్పీ అశోక్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
శనివారం 26 ఆగస్టు 2023




జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

మంత్రి సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం త్రిపురాంతకం మండలంలోని మిరియంపల్లి గ్రామంలో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రోడ్ల వెంట చిల్లచెట్ల తొలగింపు కోసం సొంతంగా జేసీబీని ఏర్పాటు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, జడ్పీటిసి మాకం జాన్‌పాల్, వైసిపి మండల కన్వీనర్ పోలిరెడ్డి, తహశీల్దార్ కిరణ్, ఎంపిడివో సూర్య నారాయణ పాల్గొన్నారు.

బాలినేనికి సన్మానం



వైసిపి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులుగా బాలిశెట్టి నాగేశ్వరరావును నియమించారు. ఈ సందర్భంగా బాలిశెట్టి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డిని శుక్రవారం సన్మానించారు.
- ప్రజాశక్తి, ఒంగోలు

ఫైనల్‌కి చేరిన కోస్టల్ రైడర్స్ (బూచేపల్లి) టీమ్..



గత పది రోజులుగా విశాఖపట్నం వేదికగా జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ టోర్నమెంట్లో కోస్టల్ రైడర్స్ (బూచేపల్లి) టీమ్ ఫైనల్‌కి చేరుకుంది. గత ఏడాది కూడా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ విజేతగా పోస్టల్ రైడర్స్ కప్పు గెలుచుకుంది.
- ప్రజాశక్తి, దర్శి

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

- 59 మందికి పదోన్నతులు
- 68 మందికి కారుణ్య నియామకంలో ఉద్యోగాలు
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత
- పాలనలో 'బూచేపల్లి' తనదైన ముద్ర
- నేడు జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజాపరిషత్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పనిచేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాలు, స్థాయి సంఘాల సమావేశాలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ పాలనలో తనదైన ముద్రను వేస్తున్నారు. ఈ నెల 26న జడ్పీ ఛైర్‌పర్సన్ జన్మదినోత్సవం సందర్భంగా ఆమె చేపట్టిన కార్యక్రమాలపై ప్రత్యేక కథనం..

జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు జడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న 59 మందికి ఉద్యోగోన్నతులు కల్పించారు. జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్‌గా భాద్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు ఆఫీస్ సబార్డినెట్ల నుండి రికార్డు సహాయకులుగా 13 మందికి, రికార్డు సహాయకులు నుండి జూనియర్ సహాయకులుగా 9 మందికి, జూనియర్ సహాయకులు నుండి సీనియర్ సహాయకులుగా 17 మందికి, సీనియర్ సహాయకులు నుండి పరిపాలనాధికారులుగా 9 మందికి, పంచాయతీ సెక్రటరీల నుండి పరిపాలనాధికారులుగా ఇద్దరికి మొత్తంగా 59 మందికి పదోన్నతులు కల్పించారు. జడ్పీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి జడ్పీ యాజమాన్య పనిచేస్తూ.. మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులు 68 మందికి ఉపాధి కల్పించారు. కారుణ్య నియామకంలో జూనియర్ సహాయకులుగా 25 మందిని, టైపిస్ట్‌లకు 15 మందిని, ఆఫీస్ సబార్డినేట్‌లుగా 28 మందిని నియామకం చేశారు.



మొత్తం 68 మందికి ఉపాధి కల్పించారు.

రెండేళ్లలో రూ.50 కోట్ల పనులు మంజూరు

జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ బాధ్యతలు స్వీకరించిన రెండేళ్ళ కాలంలో జడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.50 కోట్ల పనులను మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతంలో తాగు నీటి అవసరాల నడుపబడుతున్న సిపిడబ్ల్యు స్కీమ్‌లలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి 27 కోట్లా 64 లక్షల రూపాయలు, 2023-24 ఆర్థికసంవత్సరానికి 29 కోట్లా 36 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి 25.09.2021 నుండి మార్చి 2022 వరకు జిల్లా ప్రజాపరిషత్ సాధారణ నిధులు వివిధ పద్దులలో వివిధ అభివద్ధి (రోడ్లు, తాగునీరు, పాఠశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు) పనుల కోసం రూ.16 కోట్లా 83 లక్షలా 35 వేల నిధులు మంజూరు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధులు వివిధ పద్దుల నుండి నేటి వరకు వివిధ అభివద్ధి (రోడ్లు, త్రాగునీరు, పాఠశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు) పనులకు రూ.11 కోట్లా 86 లక్షల 97 వేలు మంజూరు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నేటి వరకు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధులు వివిధ పద్దుల నుండి నేటి వరకు వివిధ అభివద్ధి (రోడ్లు, త్రాగునీరు, పాఠశాలల మరియు ఇతర మౌలికపాయాలు) పనులకు రూ.20 కోట్లా 86 లక్షలా 90 వేలు మంజూరు చేయడం జరిగింది. రెండేళ్ల కాలంలో ఈ రెండు జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుండి మొత్తం దాదాపు 50 కోట్ల రూపాయల అంచనా విలువ గల పనులకు జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మంజూరు చేశారు.

నేడు జన్మదిన వేడుకలు

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయ్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జడ్పీ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు జన్మదిన వేడుకలలో పాల్గొననున్నారు.



సిఎం జగన్‌మోహన్‌రెడ్డితో బూచేపల్లి వెంకాయమ్మ కుటుంబం (ఫైల్)

పొదిలి ఏఎంసీ మాజీ చైర్మన్
పివి కృష్ణారెడ్డి మృతి
పలువురు నాయకుల నివాళి

ప్రజాశక్తి-కొనకనమిట్ల



వైసిపి సీనియర్ నాయకులు, పొదిలి మాజీ ఎఎంసి చైర్మన్ పివి కృష్ణారెడ్డి (80) గుండెపోటుతో హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ శుక్రవారం మృతి చెందారు. ఈయన కుమార్తె పి సరోజిని చీరాల ఆర్‌డిఓగా పని చేస్తున్నారు. పివి కృష్ణారెడ్డి స్వగ్రామం కొనకనమిట్ల మండలం వెలిగండ్ల గ్రామం. రెండు దఫాలుగా సర్పంచ్‌గా, కొనకనమిట్ల మండల ఉపాధ్యక్షులుగా పలు పదవులు నిర్వహించారు. మండల అభివద్ధికి విశేష సేవలు అందించి ప్రజలలో మంచి గుర్తింపు పొందారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. కృష్ణారెడ్డి మృతి పట్ల మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి, మార్కాపురం, కంభం మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణ, జడ్‌పిటిసి ఏడుకొండలు, మాజీ జడ్‌పిటిసి మెట్టు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, దివంగతనేత, కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు గర్రె శ్రీనివాసులు, పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నేడు వెలిగండ్ల గ్రామంలో పివి కృష్ణారెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని వెలిగండ్ల సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి తెలిపారు.


ఆహా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలులో 'ఆహా' క్యాంటిన్లు
- మెప్మా ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.20కే అల్పాహారం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటిన్‌లు ఏర్పాటు చేశారు. మొదటి విడతగా 3 క్యాంటీన్‌లను శుక్రవారం ప్రారంభించారు. అందులో కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. రాంనగర్‌లోని మినీ స్టేడియం ఎదురు, రిమ్స్ వైద్యశాలలో కూడా క్యాంటీన్‌లను నెలకొల్పారు. ఈ క్యాంటీన్‌లలో రూ.20కి అల్పాహారం అందించనున్నారు. సాంబారు అన్నం, పెరుగన్నం, పులిహార, వెజిటబుల్ ఫ్రైడ్ రైస్‌లలో ఏదో ఒకటి మాత్రమే రూ.20 చెల్లిస్తే ఇస్తారు. మార్కెట్ సెంటర్‌లో క్యాంటీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అక్కడ ఆహారాన్ని రుచి చూసి బాగుందని కితాబిచ్చారు. నగరవాసులు, నగరానికి వివిధ పనుల మీద వచ్చేవారు, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో వారం రోజుల్లో నగరంలో కొత్తగా మరో 15 ఆహా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్యాంటీన్‌లను అందుబాటులోకి తెచ్చిన మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కొండయ్య, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చేపల కోసం.. చెరువులో నీరు మళ్లింపు

నిద్రావస్థలో ఇరిగేషన్ అధికారులు • ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

చేపల కోసం వ్యాపారులు గ్రామాల్లో చెరువులను సైతం వదిలిపెట్టడం లేదు. శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ గ్రామపంచాయతీలోని మేళం చెరువులో నీటిని గ్రామంలోని పశువులు తాగునీటికి రైతులు ఎక్కువగా వాడుకుంటున్నారు. అయితే అలాంటి చెరువులో చేపలు పట్టుకునేందుకు పాట పాడుకున్న కాంట్రాక్టర్ చెరువులో ఉన్న నీటిని పొలాలకు మళ్లించి చేపలు పట్టుకుంటున్నాడు. ఈ విషయంపై గ్రామస్తులు ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందజేసినప్పటికీ ఆ చెరువు వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనక మతలబు ఏమిటోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. భారీగా ముడుపులు అందిఉంటాయన్న గుసగుసలు గ్రామంలో వినిపిస్తున్నాయి. చెరువులో పుష్కలంగా ఉన్న నీటిని కేవలం చేపలు పట్టుకోవడం కోసం పొలాల్లోకి మళ్లిస్తుంటే అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. మేళం చెరువు దగ్గర గత రెండు రోజుల నుంచి చేపల కోసం నీటిని విడుదల చేస్తుంటే, ఆ నీరు మొత్తం పొలాల వైపు వెళుతుంటే రైతులు ఫిర్యాదు చేసినా కూడా ఏ శాఖ అధికారీ అటువైపు వెళ్లకపోవడం వెనక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు కూడా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులైనా జోక్యం చేసుకొని తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. పశువులకు నీరులేక ఒకపక్క ఇబ్బందులు పడుతుంటే ఉన్న నీటిని మేళం చెరువు నుంచి చేపల కోసం దారి మళ్లించడం బాధాకరమని రైతులు అంటున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడం విశేషం.


చెరువు ఖాళీ అవుతున్న దృశ్యం


పొలంలోకి చేరిన నీరు

వద్దిమడుగులో నీటికి కటకట

బట్టలు ఉతకడం, స్నానాలు వారానికి ఒకసారే • సమస్య గురించి పలుమార్లు అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని వద్దిమడుగు గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. చేతి పంపులు, డీప్ బోర్లు పనిచేయటం లేదు. దేవాలయం దగ్గర ఉన్న చేతి పంపులోఅరకొరగా మాత్రమే నీరు వస్తున్నాయి. ఊరంతటికీ ఇదే దిక్కు. చేతిపంపు నుంచి బిందె నీరు రావాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. వ్యవసాయ బోర్లు, ఆర్థిక స్తోమత కలిగి ఇంట్లో బోరు వేసుకున్న వారిని అడుక్కొని నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు అంటున్నారు. నెల రోజుల నుంచి గ్రామంలో నీటి సమస్య నెలకొంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు చెప్పిన మా మొర ఆలకించిన పాపాన పోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు చేసే హడావుడి అంతా ఇంత కాదు. గెలిచిన తర్వాత గ్రామంలో సమస్యలు పట్టించుకున్న నాథుడే కరువయ్యారని గ్రామస్తులు అంటున్నారు. విడిచిన బట్టలు ఉతుక్కోవటం, స్నానాలు చేయటం వారం రోజులకు ఒకసారేనని బద్రి పెదరాయుడు, విజయలక్ష్మి ప్రజాశక్తితో వాపోయారు. ఇళ్లల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి సమస్య ఏర్పడటంతో ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని వారు అంటున్నారు. పలుమార్లు అధికారులకు, నాయకులకు చెప్పినా ప్రయోజనం శూన్యమేనని గ్రామస్తులు అంటున్నారు. ఇటీవల సచివాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డికి నీటి సమస్యను వివరించామని, పది రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. ఇలాంటి సమస్య మా గ్రామంలో ఎప్పుడూ లేదని గ్రామస్తులు బాధను వ్యక్తపరుస్తున్నారు. గతంలో అసిస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాలు నీటికి ఇబ్బంది లేకుండా సాఫీగా జరిగింది. బోరులో నీరు అడుగంటిపోవటంతో ప్లాంట్ మూతపడింది. సమస్యను గుర్తించిన గ్రామస్తుడు బాలకోటయ్య తన ఇంటి వద్ద బోర్ వేసి ఆ నీటిని పైపుల ద్వారా ప్లాంట్‌కు కనెక్షన్ ఇచ్చి 20 లీటర్లు 7 రూపాయలకు ఇస్తున్నాడు. ఇటీవల ఆ నీరు కూడా తగ్గింది. ఆ నీటిని కొనే స్థోమత లేనివారు కొందరు ప్లాంట్ వద్ద వృథాగా పోయే కొద్దిపాటి నీటిని వాడుకోవటానికి పట్టుకుంటున్నారు. అయితే ఆ నీటిని ఉపయోగించడం ద్వారా ఒళ్ళు దురదలు వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇంత సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమ గ్రామాన్ని ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలను చూపి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.




దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళ, ప్లాంట్ దగ్గర వృథాగా పోతున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

స్నానం చేయక వారమైంది: పెదరాయుడు



నీళ్లు లేనందున తాను స్నానం చేయక వారం రోజులయిందని గ్రామానికి చెందిన బద్రి పెదరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి, వాడుకోవటానికి నీళ్లు దొరకక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నీటిని అడుక్కోవడం నామోషీగా ఉంది: విజయలక్ష్మి



ఇతరుల ఇళ్లకు వెళ్లి ప్రతిరోజూ నీటిని అడుక్కోవాలంటే తమకు నామోషీగా ఉందని మహిళ విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. పనులు మానుకొని ఉదయం లేచిన దగ్గర నుంచి నీటి కోసం పాకులాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. బట్టలు ఉతుక్కుంటే నీరు ఎక్కడ అయిపోతుందోనని, వారానికి ఒకసారి కూడా బట్టలు ఉతుక్కునే పరిస్థితి లేదని ఆమె బాధను వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే టిడిపి ఓట్లు తొలగింపు : గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

వైసిపికి ఓటమి భయంతోనే అధికారాన్ని అడ్డం పెట్టుకుని టిడిపి మద్దతుదారుల ఓట్లు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. మైలవరంలో ఓ కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని స్థానిక టిడిపి నేతలు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌కు వ్యవస్థలను దర్వినియోగం చేయడం అలవాటుగా మారిందన్నారు. జగన్‌రెడ్డి, ఆయన గ్యాంగ్ వేస్తున్న ఎత్తులు చూసి ఎన్నికల సంఘాలే ఆశ్చర్యపోతు న్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సున్నా డోర్ నెంబర్లతో 4,16,064 దొంగ



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

ఓటర్లను చేర్పించారని అన్నారు. 2024 ఎన్నికల్లో ఈ దొంగ ఓట్లు వేయించుకుని మరోసారి ప్రజల నెత్తిన కూర్చోవాలని కుట్రలు పన్నారని ఆరోపించారు. జులై 21 నుండి సెప్టెంబర్ 7వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ఓటర్ వెరిఫికేషన్ జరుగుతుం దని అన్నారు. బిఎల్ఓలు అధికార పార్టీ నేతల ఇళ్లలో కూర్చుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని అన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగించకపోవడం, టీడీపీకి అనుకూల మని భావించే వారి ఓట్లను తొలగించడం, ఒక బూత్‌లో ఓట్లను మరో బూత్‌కు బదలాయించడం వంటి అక్రమాలపై అప్రమత్తతో ఉండాలని నేతలకు సూచిం చారు. కుటుంబ సాధికార సారథులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇన్చార్జిలు, ఓటరు పేజీ నేస్తం సభ్యులు అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. వారానికోసారి బిఎల్ఓ వద్ద ఓట్ల వివరాలు తెలుసుకోవాలని కోరారు. ఉద్దేశపూర్వకంగా ఓట్లు తొలగిస్తే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - నిజాంపట్నం

వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం నిజాంపట్నం పోలీస్ స్టేషన్ ను రేపల్లె డీఎస్పీ టీ మురళికృష్ణ సందర్శించారు. తొలుత ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి అమ్మడం, కొనడం, సేవించడం కానీ ఎక్కడైనా ప్రజలకు సమాచారం తెలిస్తే పోలీస్ వారికి తెలపాలన్నారు. ఎవరైనా గంజాయి అమ్మిన, కొన్న వారితో పాటు ఎక్కడ నుంచి గంజాయి వస్తుందనే దానిపై పక్కగా దర్యాప్తు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, కోడి పందాల, జూదాలు వంటి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసు నిఘా ఎప్పుడు ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిలు చేరకుండా ప్రతి రోజూ గస్తీని నిర్వహిం చాలని ఆదేశించారు. దొంగ తనాలు, నేరాలు జరగకుండా ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. రేపల్లె రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని శ్రీసాయిబాలాజీ హైస్కూల్‌లో డివిజన్ స్థాయిలో పాఠశాలల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ పోటీలను శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక వికాసంతో పాటు శారీరక ఎదుగుదల కూడా అవసరమని, అందుకోసం క్రీడల పట్ల ఆసక్తి చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ పెరుమాళ్ళ ప్రకాశరావు, ప్రిన్సిపల్ ఎస్‌డి.మస్తాన్‌వలి తదితరులు పాల్గొనగా పిఇటిలు వలి, వెంకటేశ్వర్లు క్రీడలను నిర్వహించారు.

ర్యాగింగ్‌తో జీవితాన్ని చిధ్రం చేసుకోవద్దు

ప్రజాశక్తి-మార్కాపురం



ర్యాగింగ్‌పై మాట్లాడుతున్న ట్రైనీ ఎస్‌పి

విద్యార్థులు చదువుకొనే దశలో ర్యాగింగ్ జోలికి వెళ్తే జీవితం చిధ్రమేనని ట్రైనీ ఎస్పీ సురానా అంకిత మహావీర్ హెచ్చరించారు. స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ అన్నా కష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐపిఎస్ ఆఫీసర్ మహావీర్ మాట్లాడుతూ విద్యా సంస్థలలో ర్యాగింగ్ జరగకూడదని అన్నారు. చదువుకొనే వయస్సులో ఇతర వ్యాపకాలు పెట్టుకోవద్దన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. అనంతరం అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం భీమానాయక్, పెద్దారవీడు ఎస్ఐ పులి రాజేష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రంగనాయకులు, కళాశాల ఏఓ బి ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పివి అనిల్‌కుమార్, యాంటీ ర్యాగింగ్ కమిటీ ఛైర్మన్ పి రామ్మోహన్, హెచ్ఒడిలు డాక్టర్ జెవి అనిల్‌కుమార్, కె రాముడు, కె కిషోర్‌బాబు, బి రాజు పాల్గొన్నారు.

చీరాలలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఆటంకాలు

వైసిపిలోని అంతర్గతపోరే కారణమా?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అంబేద్కర్ వాదులు త్యధికంగా ఉన్న చీరాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు విషయంలో సంవత్సర కాలంగా రాజకీయ రగడ కొనసాగుతోంది. విజ్ఞప్తులు, విన్నపాల దశ దాటి ధర్నాలు, నిరసనలకు కొందరు పూనుకున్నారు. రైల్వేస్టేషన్ ఎదురుగా దశాబ్దాల క్రితం ముక్కోణం పార్కు వద్ద దాతల చేయూతతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ విగ్రహ కమిటీ అధ్యక్షులుగా సలగల రాజశేఖర్ నేతృత్వంలో పలువురు దళిత సంఘాల నేతలు భాగస్వాములయ్యారు. ఏడాది క్రితం ఈ విగ్రహం స్థానంలో నూతనంగా కాంస్య విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోరుతూ పట్టణంలోని కొందరు దళిత నేతలు పురపాలక సంఘానికి అర్జీ ఇచ్చారు. ఈ అంశాన్ని కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం తీసుకునే సమయంలో తామే అంబేద్కర్ విగ్రహం పెడతామని మరి కొందరు దళిత నేతలు కౌన్సిల్‌ను కోరారు. దీంతో ఈ అంశాన్ని అప్పట్లో వాయిదా వేశారు. ఆ తరువాత రోజుల్లో కూడా పలువురు అంబేద్కర్ కాంస్య విగ్రహం తామే పెడతామంటూ అనుమతుల కోరారు. వీరందరూ దాతల



దళిత సంఘాలు కోరుతున్న నమూనా

సహకారంతో విగ్రహం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పెట్టడం సమంజసం కాదని చీరాల పురపాలక సంఘ సభ్యులు భావించారు. పురపాలక సంఘ నిధులతో అంబేద్కర్ కాంస్య విగ్రహం పెట్టాలని తీర్మానించి రూ.30 లక్షలు మున్సిపల్ సాధారణ నిధులను మంజూరు చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన కమిటీని వేశారు. మున్సిపల్ నిధులతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పాత విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి అంబేద్కర్ భవనంలో నెలకొల్పారు. నూతన కాంస్య విగ్రహం ప్రతిష్ట పనులను పురపాలకులు పర్యవేక్షి స్తున్నారు. అయితే నూతనంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహ నమూనాను తమకు చూయిం చకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా, దళిత, ప్రజాసంఘాల నేతృత్వంలో విగ్రహ నిర్మాణ కమిటీ వేయకుండా ఏకపక్షంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును తాము అంగీకరిం చబోమని కొందరు దళిత నేతలు ఆందోళనలు చేపట్టారు. పార్లమెంట్‌పై అంబేద్కర్ నిలబడి ఉన్నట్లుగా ఉన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత నేతలు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆ సర్కిల్‌లో ఆ నమూనాతో విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం చాలా అవసరం. వ్యయం కూడా చాలా పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో కొందరు నేతలు చెబుతున్నట్లు విగ్రహం నెలకొల్పడంలో ఉన్న సాధ్యా సాధ్యాల గురించి మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు చర్చించడం జరిగింది. ప్రజాభిప్రాయం మేరకు అందు బాటులో ఉన్న ఆర్థిక వనరుల్లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కలసిరావాలని కోరారు. అయినప్పటికీ కొందరు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును అడ్డుకుంటామని చెప్పడం పట్ల రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయని భావిస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ఏపని చేపట్టినా అందులో రాజకీయాలను చొప్పించి ఆ పని సక్రమంగా జరుగకుండా చేయడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో చీరాల వైసిపిలో నెలకొని ఉన్న అంతర్గత పోరు కారణంగానే అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటులో రాజకీయ రగడ చోటు చేసుకుంటోందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కాంస్య విగ్రహం పెడితే అధికార వైసిపి నేతలకు పేరు వస్తుందన్న కారణంతో ఆ పార్టీలో ప్రతిపక్షపాత్ర పోషిస్తున్న వారే దళిత, ప్రజాసంఘాల వారి పేరుతో అడ్డుకునే ప్రయత్నాలు జరుగు తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా తెర వెనుక జరుగుతున్న వ్యవహారాల గురించి వైసిపి అధిష్టానం దృష్టికి ఫిర్యాదు లెళ్లాయి. వైసిపి తరపున స్థానికంగా సర్వేలు జరుపుతున్న వారు రాజకీయ రగడ గురించి నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. దళిత సంఘాల నేతలు కోరుతున్న సాధ్యాసాధ్యాలు పరిశీలించాల్సి ఉంది.

ఈ క్రాప్ నమోదు జాబితా ప్రకటన

ప్రజాశక్తి - రేపల్లె



ఎడిఎ సయ్యద్ అక్తర్

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్ రైతుల జాబితాను మండలం లోని 23రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రకటిస్తున్నట్లు ఏడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇప్పటివరకూ 23వేల ఎకరాలలో ఈ కర్షక్ జరిగిందని తెలిపారు. ఈకేవైసి ద్వారా సాగు భూమి కలిగిన ప్రతి రైతు తమ భూమిని ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని అన్నారు. దీనివల్ల రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతాయని అన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రైతుల నష్టపోతారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌కు సంబంధించిన పంటలకు ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

27న ముస్లిం ఐక్యవేదిక సమావేశం

ప్రజాశక్తి - నిజాంపట్నం

ముస్లిం ఐక్యత సమావేశంలో ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు పాల్గొనాలని ముస్లిం ఐక్యవేదిక రేపల్లె నియోజకవర్గ అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్ కోరారు. మండలంలోని నిజాంపట్నంలో ముస్లిం పెద్దలకు శుక్రవారం ఆహ్వాన పత్రాలు అందజేశారు. ముస్లిం సోదరుల ఐక్యతే లక్ష్యంగా ఈనెల 27న నిర్వహించే ఈ సమావేశానికి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు, మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఛైర్మన్లు, మేధావులు, సంఘ సేవకులు, డాక్టర్లు, లాయర్లు, వివిధ అసోసియేషన్ పెద్దలు, వివిధ ముస్లిం ఆర్గనైజేషన్ పెద్దలు, కుల సంఘాల పెద్దలు పాల్గొంటారని తెలిపారు. గుంటూరులోని పొన్నూరు వెళ్లే రోడ్డులోని బి - కన్వెన్షన్ సెంటర్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు సాయిబాబు

ప్రభుత్వ కార్యాలయంలో పార్టీ సమీక్షలా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వ అధికారులతో పార్టీ సమీక్షలు చేయడం ఏమిటని, సాక్ష్యాత్తు మంత్రి నాగార్జున నాలుగేల ఓట్లు తొలగించాలని అధికారులను ఆదేశించడం హేమయైన చర్యని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా పార్టీ సమీక్షను ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించడం చట్టవ్యతిరేకమని అన్నారు. ఓట్లు తొలగించాలనడంలోనే ఆయన ఓటమి ఉందని అన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేశామని అన్నారు. పరిశీలించి విచారణ చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫారం-7తో ఓట్లు తొలగించే పనిచేస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి పక్షాలను ఎదుర్కోలేక టిడిపి ఓట్లు తొలగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సిఎం ఆదేశాలతో ఇలాంటి చర్యలకు పూనుకున్నారని ఆరోపించారు. టిడిపి కార్యకర్తలతో పాటు ప్రతి ఒక్కరు తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవలని కోరారు. ఫారం-7పై ఏ ఒక్కరు తొందర పడి సంతకాలు చెయ్యారదని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, అధిన బసవపున్నయ్య, యడ్ల జయసిలరావు, బట్టు మల్లిఖార్జునరావు, వాకా శేషుబాబు, రాయన ప్రసాద్, మాచర్ల నాగరాజు, వేములపల్లి జగన్నదరావు, చిన బాబు, సుందరరావు ఉన్నారు.

కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు



మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

విఓఏల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎపి విఓఏ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటి సమావేశం శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. విఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వేతనాలు పెంచి, కాలపరిమితి సర్క్యులర్ విడుదల చేశారని తెలిపారు. విఓఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సెప్టెంబర్ 5వ తేదిన ఒంగోలులోని ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి యూనియాన్ నాయకులు డి కాశీరత్నం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆర్ మాధవి, ముక్తియార్, రేవతి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

టిటిడి డైరెక్టర్‌గా శిద్దా సుధీర్

ప్రజాశక్తి-చీమకుర్తి

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్ మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి, టిటిడి ఛైర్మన్ కరుణాకరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. టిటిడి డైరెక్టర్‌గా సుధీర్‌ను నియమించడం పట్ల శిద్దా అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



సుధీర్

అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి: కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్: నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంజినీర్ మాల్యాద్రి, డిఈఈలు గణపతి, పద్మజ, రఘురాం, ఏఈలు సౌజన్య, ప్రసాదరావు, చంద్రశేఖర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

30 నుంచి నిరసనలు

- ప్రజలు జయప్రదం చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు రాష్ట్రంలో జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణ మోహన్ అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడారు. రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తూ.. ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేయకపోతే అప్పుకి అనుమతి ఇచ్చేది లేదన్న కేంద్రం బెదిరింపులకు జగన్ గిలగిలలాడుతున్నారని చెప్పారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలన్నారు. అధిక ధరలను అదుపు చేయాలని, సరసమైన ధరలకు నిత్యవసరాలు అందించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని.. దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు సిపిఎం పిలుపునిచ్చిందన్నారు. ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, ఎన్.బాబూరావు, సిహెచ్. మణిలాల్, మజుందార్ పాల్గొన్నారు.